క్లుప్తంగా

తడి-పొడి చెత్త నిర్వహణపై అవగాహన



తడి-పొడి చెత్త, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎండీవో శ్రీనివాసరావు

కరప: మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ, తడి-పొడి చెత్త వేరు చేయడంపై వాకాడ గ్రామ ప్రజలకు డిప్యూటీ ఎండీవో ఎస్వీ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని వాకాడ గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఇంటింటికీ చెత్త సేకరణ నుంచి తడి-పొడి చెత్తను వేరు చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుధ్యంపై ప్రజల్లో సరైన అవగాహన కొరవడిందని, చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వకుండా రోడ్డు పక్కన, డ్రైనేజీల్లో వేస్తున్నారన్నారు. ఈ సీజన్‌లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

ప్రేమ విఫలమై ఆత్మహత్య



జాస్మిన్ (ఫైల్)

కాకినాడ క్రైం: కాకినాడలో ప్రేమ విఫలమై ఓ ట్రాన్స్ జెండర్ ఆత్మహత్యకు పాల్పడింది. మహాలక్ష్మి నగర్‌లో నివసిస్తున్న జాస్మిన్(19) కొన్నాళ్లుగా ఓ యువకుడితో ప్రేమలో ఉంది. అయితే కొద్ది రోజులుగా వీరి మధ్యలో మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. యువకుడు తనని మోసం చేశాడని తెలుసుకొని జాస్మిన్ మనోవేదనకు గురైంది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓజోన్ పొరను సంరక్షించుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అలపాటి శ్రీనివాసరావు

బాలాజీచెరువు: ఓజోన్ పొరను ప్రతి ఒక్కరూ సంరక్షించుకోవాలని జేఎన్‌టీయూకే అసిస్టెంట్ ప్రొఫెసర్ అలపాటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం ఇటీవలే జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ భూమిపై జీవరాశి మనుగడకు ఓజోన్ పొర కారణమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కరుణ మాట్లాడుతూ భావి తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం కావాలంటే పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ నాగ శ్రీకాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ రంగంపై ఉపాధి శిక్షణ

సామర్లకోట: స్థానిక సీబీఎం సెంటర్‌లో ఉన్న న్యాక్ శిక్షణా కేంద్రంలో నిరుద్యోగ యువతకు గృహ నిర్మాణ రంగంలో మూడు నెలల ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సెంటర్ కో ఆర్డినేటర్ ఆర్‌ఎన్ఎస్ఎస్ శివ తెలిపారు. సర్వేయింగ్, ప్లంబింగ్ కోర్సులలో మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటు శిక్షణ అనంతరం ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఈ మేరకు 8వ తరగతి నుంచి డిగ్రీ వరకు అర్హత కలిగిన అభ్యర్థులు 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. వివరాలకు 94407 56250, 96667 71726, లేదా 73864 06664లకు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ శిక్షణ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

రామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి వారు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రసిద్ధిగాంచిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు మహాగణపతి పూజ, మహన్యాస పారాయణ ఏకాదశ ద్రవ్య మహా రుద్రాభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పమాలలతో రామలింగేశ్వర స్వామిని అలంకరించి సప్త హారతులు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కుండపోతతో అతలాకుతలం



వైఎస్సార్ బ్రిడ్జి కింద నిలిచిన వర్షపునీటిలో ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు



టూటౌన్ నూకాలమ్మ గుడి నుంచి వివేకానంద పార్కుకు వెళ్లే ప్రధాన రహదారిలో నిలిచిపోయిన నీరు

- అవస్థలు పడిన కాకినాడ ప్రజలు
- రహదారులన్నీ జలమయం
- పట్టించుకోని అధికారులు

బోట్‌క్లబ్: నగరంలో రెండు రోజులుగా కుండపోతగా వర్షం కురవడంతో పలు రహదారులు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. దీంతో సాధారణ ప్రయాణికులు అనేక అవస్థలు పడ్డారు. మంగళవారం ఉదయం గంటన్నర పైనే హోరున వర్షం కురవడంతో నగరంలో పలు ప్రాంతాలలో వర్షపు నీరు రోడ్లపైకి చేరింది. దీంతో సాధారణ ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. స్థానిక వైఎస్సార్ బ్రిడ్జి కింద వర్షపునీరు నిల్వ ఉండిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. చిన్నమార్కెట్‌కు వెళ్లేందుకు ప్రజలు అవస్థలు పడాల్సి వచ్చింది. స్థానిక మెయిన్ రోడ్డులో వర్షపునీరు రోడ్డుకు ఇరువైపులా నిల్వ ఉండిపోవడంతో ఆయా దుకాణాలకు వెళ్లేందుకు వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. చిన్నపాటి వర్షాలకు నగరంలో వర్షపునీరు రోడ్లపై నిలిచిపోవడంతో ప్రజల బాధలు వర్ణణాతీతం. స్థానిక ఎల్‌బీ నగర్, సినిమా రోడ్డు, శాంతినగర్, రామారావు పేట, గాంధీ నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో వర్షపునీటి వల్ల ప్రజలు పడరానిపాట్లు పడ్డారు. గంటల తరబడి ప్రధాన రహదారులపైనే వర్షపునీరు ఉండిపోతున్నా కార్పొరేషన్ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. డ్రైనేజీల్లో పూడిక సక్రమంగా తీయకపోవడంతో వర్షపునీరు డ్రైనేజీల్లోకి వెళ్లకపోవడంతో రోడ్డుపై ఉండిపోతోందని మండిపడుతున్నారు.

విద్యుత్ లేక అవస్థలు

కుండపోత వర్షం వల్ల మంగళవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయడంతో నగర ప్రజలు పడరానిపాట్లు పడ్డారు. వర్షం గంటన్నరలోపే తగ్గినా విద్యుత్ పునరుద్ధరించలేదు. దీంతో కళాశాలలు, పాఠశాల్లో విద్యార్థులు, అపార్ట్‌మెంట్ వాసులు లిఫ్టులు, నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. అసలు విద్యుత్ ఎప్పుడు వస్తోందో తెలుసుకునేందుకు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసినా సరైన సమాధానం చెప్పకపోవడంతో వినియోగదారులు మండిపడ్డారు.

రూరల్ మండలంలో..



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ వద్ద రహదారిపై పరిస్థితి..

కాకినాడ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో రెండు రోజులుగా పడుతున్న వర్షాలకు పల్లపు ప్రాంతాలు, రహదారులు జలమయయ్యాయి. కాకినాడ రూరల్ మండలంలో ప్రధాన రహదారులతో పాటు పలు ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచిపోయింది. రమణయ్యపేట, ఏపీఐఐసీ కాలనీ, వలసపాకల, వాకలపూడి, సర్పవరం, తిమ్మాపురం, తదితర గ్రామాలలో రహదారులపై నీరు నిలిచిపోవడంతో జనాలు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పడిన వర్షాలకు సిమెంట్ రోడ్లపైనా నీరు నిలిచింది.

మొక్కుబడిగా సర్పంచ్‌ల శిక్షణ



కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు శిక్షణ ఇస్తున్న అధికారి

కాకినాడ రూరల్: గ్రామాలలో ప్రజలకు మెరుగైన సేవలు, సౌకర్యాలు అందించేందుకు సుస్థిర లక్ష్యాల సాధనకు, రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్ఏ) వార్షిక కార్యాచరణ 2025-26పై సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు మొక్కుబడిగా సాగుతున్నాయి. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో కాకినాడ రూరల్, కరప, పెదపూడి, గొల్లప్రోలు మండలాల సర్పంచ్‌లు, ఎంపీపీలకు సోమ, మంగళవారాల్లో ఏర్పాటు చేసిన తరగతులకు నలుగురు ఎంపీపీలు, 89 మంది సర్పంచ్‌లు హాజరు కావాల్సి ఉంది. కాకినాడ రూరల్ ఎంపీపీ అనంతలక్ష్మి, సర్పంచ్‌లు బెజవాడ సత్యనారాయణ, రామదేవు సూర్య ప్రకాశరావు తదితరులు సుమారు 20 మంది మాత్రమే హాజరయ్యారు. దీంతో రెండు రోజుల శిక్షణ తరగతులు మొక్కుబడిగా జరిగాయి. ఎంటీటీ, కోటనందూరు ఈఓపీఆర్ ఆర్‌డీ ఎస్.జయరామ్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. కాకినాడ రూరల్ ఈఓపీఆర్ అండ్‌ఆర్‌డీ సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సేవలు ప్రశంసనీయం



మఠపూజా కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తరాది మఠాధిపతులు సత్యాత్మ తీర్థ స్వామీజీ

బోట్‌క్లబ్: మధ్వ సభ చేస్తున్న ఆధ్యాత్మిక సేవలు ప్రశంసనీయమని ఉత్తరాది మఠాధిపతులు సత్యాత్మ తీర్థ స్వామీజీ అన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం నగరానికి చేరుకున్న స్వామీజీకి మధ్వసభ కమిటీ కార్యదర్శి కోపెల్ల శేషగిరిరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా స్వాగతం పలికారు. కమిటీ సభ్యులు సుసర్ల చలపతిరావు నివాసంలో ఉత్తరాది మఠ సంస్థాన పూజను స్వామీజీ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ రామాయణ, భారత, భాగవతాలలో విశేషాలను వివరిస్తూ మన్యుసూక్త మహిమను వివరించారు. కమిటీ సంయుక్త కార్యదర్శి యాతగిరి పరశురామ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్య కర్మలు ఆచరించడంలో అశ్రద్ధ చేయవద్దని కోరారు. కాకినాడ, పరిసరాల గ్రామాల్లోని మధ్వ గృహస్తుల కోసం కమిటీ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని, వాటిలో అందరూ పాల్గొనాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో మఠ దివాన్ సుధా పండితుడు శశి ఆచార్, రాజమండ్రి ఉత్తరాది మఠాధికారి సుధా పండితుడు విజయ సింహాచార్ పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

జిల్లా కార్యదర్శి రాజబాబు



సమావేశంలో మాట్లాడుతున్న కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాజబాబు

కరప: మండలంలో 5 వేలకు పైబడి కౌలు రైతులు ఉన్నారని, వారికి అన్నదాత సుఖీభవ రూ.20 వేలు ఇవ్వాలని, దానికి తగ్గట్టు గుర్తింపు ఇవ్వాలని, ఈ-క్రాప్ నమోదు చేయాలని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. స్థానిక భవన నిర్మాణ కార్మికులు భవనంలో ఎడ్ల కృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎం. రాజశేఖర్ మాట్లాడుతూ కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వడానికి వ్యవసాయ శాఖ అధికారులు ఈ-క్రాప్ చేయించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు పంట విక్రయించుకోవడానికి కూడా హక్కు లేకుండా ఉందని, రైతు సేవా కేంద్రం అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో కౌలు చట్టం ఉనికిలో లేదని, ఈ మేరకు చట్టం చేయాలని ఇప్పటికే పలు దఫాలుగా ప్రభుత్వానికి వినతులు ఇచ్చామని, దీనిపై ప్రభుత్వం స్పందించాలని సమావేశం డిమాండ్ చేసింది. ఈ సమావేశానికి సీఐటీయూ నాయకులు రాంప్రసాద్ మద్దతుగా మాట్లాడారు. సెప్టెంబర్ నెలాఖరు నాటికీ మండల మహాసభ జరపాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో రైతులు రెడ్డి వీరభద్రరావు, పెంకే ధనరాజు, బి.వీర వెంకట సత్యనారాయణ, చందాల శ్రీను, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఎస్‌జీఎఫ్ఐ ఎంపికలు



ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 బాలికల వెయిట్ లిఫ్టింగ్ జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా క్రీడా మైదానంలో వివిధ క్రీడాంశాల్లో క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలను జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి కె.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెయిట్‌లిఫ్టింగ్, జిమ్నాస్టిక్స్ విభాగాల్లో బాలురు, బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నామన్నారు. వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో డీఎస్ఏ వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ సతీష్‌కుమార్; సెలక్షన్ కమిటీ సభ్యులు రామకృష్ణ ఎంపికలను పర్యవేక్షించారు. జిమ్నాస్టిక్స్ విభాగంలో పీడీ ప్రసాద్, డీఎస్ఏ జిమ్నాస్టిక్స్ కోచ్ సురేష్ ఎంపికలను నిర్వహించారు. టెన్నిస్ విభాగంలో ఎంపికలు వర్షం వల్ల వాయిదా వేశారు. ఎంపికలకు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎంపికల నిర్వహణలో పీడీలు గాంధీ, హరిబాబు, ప్రసాద్, రవిరాజు, మాచరరావు, పట్టాభి సహకారం అందించారు. బాలికల కార్యదర్శి సుధారాణి మంగళవారం జరిగిన ఎంపికలను పర్యవేక్షించారు.

కుక్కల ప్రాణాలకు అభయం

- ఆపరేషన్ థియేటర్‌లో ఫ్యుమిగేషన్
- రేపటి నుంచి శస్త్ర చికిత్సలు యథాతథం
- కార్పొరేషన్ ఆరోగ్య అధికారి పృథ్వీచరణ్

సాక్షి స్పందన

బోట్‌క్లబ్: నగరంలో కుక్కల సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాకినాడ నగరంలో కుక్కలకు చేస్తున్న ఆపరేషన్ వికటించి పలు మూగజీవాలు చనిపోవడంతో ఈ నెల 8న సాక్షిలో 'పట్టించుకోలేక ప్రాణం తీస్తున్నారు!' కథనం రావడంతో కార్పొరేషన్ అధికారులు స్పందించారు. స్థానిక గోలీలపేటలో శ్మశానవాటికలో ఉన్న కుక్కలకు ఆపరేషన్ చేసే థియేటర్ సక్రమంగా లేదని గుర్తించి అక్కడ థియేటర్‌ను శుభ్రం చేసేందుకు ఫ్యుమిగేషన్ (బ్యాక్టీరియా నిరోధానికి పొగ లేదా ఆవిరి వంటి పదార్థంతో పిచికారీ) చేశారు. ఈ ప్రక్రియ వల్ల ఎక్కడైనా బ్యాక్టీరియా ఉంటే చనిపోతుందని నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి పృథ్వీ చరణ్ తెలిపారు. వారం రోజులు ఈ ప్రక్రియ సాగిందని గురువారం నుంచి మళ్లీ కుక్కలకు అక్కడ శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

ఉత్సాహంగా ఉట్టి కొట్టు వేడుక



ఉట్టు కొడుతున్న కొత్తూరు భక్తులు



సామర్లకోటలో సాగుతున్న శ్రీకృష్ణుని గ్రామోత్సవం

సామర్లకోట: స్థానిక మాండవ్య నారాయణస్వామి ఆలయంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలలో భాగంగా మంగళవారం రాత్రి ఉట్టి కొట్టు వేడుక ఉత్సాహంగా జరిగింది. కృష్ణుని ఊరేగింపు కొత్తూరులోని గణపతి ఆలయం వద్దకు చేరిన తరువాత ఆ ప్రాంత ప్రజలు రాత్రి 9 గంటలకు ఊట్టు కొట్టు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పిల్లలు, పెద్దలు, మహిళలు ఉట్టి కొట్టు కార్యక్రమంలో పాల్గొన్నారు. పాటలు, కేరింతల మధ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏటా మాండవ్య నారాయణస్వామి ఆలయంలో వైష్ణవ అష్టమి రోజున శ్రీకృష్ణ జన్మాష్టమి నిర్వహిస్తారు. ఆలయం గోదావరి కాలువ ఆవలివైపు ఉండటంతో భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం లేక పోవడంతో ఏటా కొత్తూరులోనే ఊట్టు కొట్టు వేడుక నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో కృష్ణుని గ్రామోత్సవం

సామర్లకోట: శ్రీకృష్ణుని గ్రామోత్సవం మంగళవారం సాయంత్రం భక్తి శ్రద్ధలతో సాగింది. స్థానిక అతి పురాతన విష్ణు ఆలయమైన మాండవ్య నారాయణస్వామి ఆలయంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించిన విషయం తెలిసిందే. కాగా మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం గరుడ వాహనంపై శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. గోదావరి కాలువపై ఉన్న కాలిబాట వంతెన, ఫ్లై ఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్, గాంధీచౌక్, పెద్దవీధి, చిన్నవీధి, యార్లగడ్డవారి వీధి, మఠంసెంటర్, అయోధ్య రామపురం, కొత్తూరు మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రఘురామ్ ఆచార్యులు, అనంత పద్మనాభాచార్యులు, రవికుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

స్థలాలను స్వాధీనం చేయండి



ఇళ్ల స్థలాల సమస్యపై తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన హరిబాబు, లబ్ధిదారులు

సామర్లకోట: స్థానిక 13వ వార్డులో సుమారు 120 మందికి గత ప్రభుత్వంలో ఇచ్చిన స్థలాలను స్వాధీనం చేయాలని లబ్ధిదారులు మంగళవారం తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలకు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం సెంటు చొప్పున స్థలాలు కేటాయిస్తూ పట్టాలు ఇచ్చారని తెలిపారు. అయితే స్థలాలు చూపించే క్రమంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో వాటిని స్వాధీనం చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటి వరకు ఎన్నికల హామీలలో ఇళ్ల స్థలాలపై దృష్టి సారించడం లేదని ఆరోపించారు. వెంటనే గత ప్రభుత్వ పట్టాల ప్రకారం స్థలాలను స్వాధీనం చేస్తే పాకలు వేసుకుని జీవిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నమళ్ల రాజేశ్వరి, బోడపాటి లక్ష్మి, ఆర్.విమల, మచ్చా చిన్నారావు, నీడిల రాజేష్‌లు పాల్గొన్నారు. ఈ సమస్యను జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకువెళ్తామని తహసీల్దార్ లబ్ధిదారులకు తెలిపారు.

ఆర్థిక సమానత్వం కోసమే పీ4

సామర్లకోట: ఆర్థిక సమానత్వం సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పి-4 పథకాన్ని ప్రవేశ పెట్టిందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండల పరిధిలో హుస్సేన్‌పురంలో ఆర్డీఓ కె.శ్రీరమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పారిశ్రామికవేత్త, ఉద్యోగులు వెనుకబడిన కుటుంబాలను గుర్తించి వారిని దత్తత తీసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ మేరకు గ్రామంలో ఎనిమిది బంగారు కుటుంబాలను గుర్తించి తాను దత్తత తీసుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కొవ్వూరి చంద్ర శేఖరరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టంపై సుప్రీం స్టే ఊరటనిచ్చింది



కరీం బాషా

కాకినాడ రూరల్: వక్ఫ్ సవరణ చట్టం 2025పై సుప్రీం కోర్టు తాత్కాలిక స్టే విధించడాన్ని స్వాగతిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఏ కరీం బాషా స్థానిక పార్టీ కార్యాలయంలో వివరించారు. ఈ సవరణ చట్టం లోక్‌సభ, రాజ్యసభలో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం సమాజానికి అండగా ఉండి సవరణ చట్టం బిల్లుకు వ్యతిరేకంగా ఎంపీలందరూ ఓటు వేసినట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వం అనుకూలంగా ఓటు వేసి బిల్లుకు ఆమోదముద్ర పడేలా సహకరించి తమ వర్గానికి ద్రోహం చేసిందని పేర్కొన్నారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశంలోని ముస్లింలు ఎన్నో కేసులు వేశారని, అలాగే రాష్ట్రం నుంచి వైఎస్సార్ సీపీ తరఫున జగన్ కూడా కేసు వేసినట్టు తెలిపారు. అందువల్ల సుప్రీంకోర్టు పరిగణలోకి తీసుకుని విచారించి వక్ఫ్ సవరణ చట్టంపై స్టే ఇచ్చిందని తెలిపారు. సుప్రీంకోర్టు స్టే ఇచ్చిన అంశాల్లో భాగంగా ఆస్తి హక్కు పరిరక్షణ, యాదృచ్ఛిక అధికారాల నివారణ, అధికారాల విభజన, అంటే ఆస్తి వక్ఫ్ దా ప్రభుత్వానిదా అని తేల్చేది జిల్లా కలెక్టర్ కాదని సుప్రీంకోర్టు కీలక ఆదేశాల ముఖ్య ఉద్దేశమన్నారు.

ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు

బాలాజీచెరువు: స్థానిక పైండా సత్తిరాజు మున్సిపల్ పాఠశాలలో మంగళవారం వారధి జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా 19 మండలాల నుంచి 38 గ్రూపుల సభ్యులు హాజరయ్యారు. పోటీల్లో నవభారత్ ఉన్నత పాఠశాల బృందం ప్రథమ స్థానం సాధించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి వినీల్, సమగ్ర శిక్ష ఏఎంఓ జగన్మోహన్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



తాగునీటి పథకం ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అబ్దుల్ మతీన్

కొత్తపల్లి: తాగునీటి సమస్య రాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఈఈ అబ్దుల్ మతీన్ అన్నారు. వాకతిప్ప శివారులోని నాగులాపల్లి రక్షితనీటి పథకాన్ని ఆయన మంగళవారం అకస్మాత్తుగా తనిఖీ చేశారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు, ఫిల్టర్ బెడ్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం కొత్తపల్లిలోని పెద్ద చెరువులో నిర్మించనున్న రక్షిత నీటి పథకం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైప్‌లైన్ మరమ్మతులకు గురైతే తాగునీటి అంతరాయం ఏర్పడుతుందని ప్రజలకు వివరించాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులకు పూర్తి స్థాయిలో నీటిని అందించే బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్దేశిత సమయానికి శుభ్రపరచాలన్నారు. ఆయన వెంట డీఈ శ్రీనివాస్, ఏఈ రమణ ఉన్నారు.

స్వచ్ఛ సామర్లకోటకు కృషి చేయాలి

సామర్లకోట: స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛ సామర్లకోట కోసం కృషి చేయాలని స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. ఓజోన్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఈ మేరకు విద్యార్థులు, ఉపాధ్యాయులచే ప్రతిజ్ఞ చేయించారు. బుధవారం నుంచి ఈ నెలాఖరు వరకు విద్యార్థులలో పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతలపై రోజు వారి షెడ్యూల్ ప్రకారం అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త జానకి

పెద్దాపురం: మెట్ట ప్రాంత రైతులు కర్ర పెండలం సాగు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని స్థానిక దుంప సాగు పరిశోధన క్షేత్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.జానకి అన్నారు. మండలంలోని రాయభూపాలపట్నం గ్రామంలో మంగళవారం ఉద్యాన శాఖాధికారి కె.సత్యశైలజ అధ్యక్షతన దుంప సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త జానకి మాట్లాడుతూ కర్ర పెండలం సాగు చేసే రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల వాడకం, చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. ఉద్యాన శాఖాధికారి సత్యశైలజ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగులో కల్పించే ప్రోత్సాహకాలతో పాటు మామిడి, జీడిమామిడి, బొప్పాయి, జామ పంటలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు మన్యం ప్రసన్నకుమార్, కల్లూరి శ్రీనివాస్, నల్లల శ్రీను తదితరులు పాల్గొన్నారు.